క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత యామినిరెడ్డి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం గోపాలపట్నంకు చెందిన ఎస్. యామినిరెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో భ్రమరాంబ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ట్రెకింగ్



ట్రెకింగ్ నిర్వహిస్తున్న యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ యూనిట్

సింహాచలం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ సిటీ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం మాధవధార నుంచి సింహగిరికి నిర్వహించిన ట్రెకింగ్ ఉత్సాహంగా సాగింది. ఉదయం 7గంటలకు మాధవస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ట్రెకింగ్ 10 గంటలకు సింహగిరిపై ముగిసింది. పెద్దలు, పిల్లలతో కలిపి మొత్తం 70 మంది పాల్గొన్నారు. యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ సిటీ యూనిట్ చైర్మన్ ఎస్‌ఆర్‌పీ మోహన్, అధ్యక్షుడు ఎ.పుండరీకాక్ష, ఉపాధ్యక్షుడు పీఎస్‌ఎన్.రెడ్డి, కార్యదర్శి కేవీఈ ప్రసాద్, కోశాధికారి జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

రామ మందిరం అక్షింతల ఊరేగింపు



శ్రీరామ మందిరం అక్షింతల ఊరేగింపులో పాల్గొన్న ముమ్మన దేముడు

పెందుర్తి: అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీరామ మందిరం పూజిత అక్షింతలను జీవీఎంసీ 95వ వార్డు గొల్లవిల్లివానిపాలెం, పాపయ్యరాజుపాలెం ప్రాంతాల్లో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముమ్మన దేముడు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో రామ మందిరానికి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఆ రోజు అంతా ఇళ్లలో పూజలు చేయాలని కోరారు. పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రాయపుర అగ్రహారంలో కోవిడ్ కేసు నమోదు



బ్లీచింగ్ జల్లుతున్న గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని రాయపురం అగ్రహారంలో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైనట్లు సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్‌ఎస్ చక్రవర్తి ఆదివారం తెలిపారు. హోమ్ హైసోలేషన్‌లో ఉండాలని సూచించారు.కాంటక్టుల సమాచారం గుర్తించడంతో పాటు వారి నుంచి శాంపిల్స్ సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమూహాలకు దూరంగా ఉండాలని,మాస్కులు విధిగా ధరించాలన్నారు. కోవిడ్ లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్‌కు సత్కారం

డాబాగార్డెన్స్ : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో టాలెంట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నృత్య కళాకారుడు నటరాజ పరమేశ్వరన్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిలో భాగమైన కళలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కార్యక్రమంలో ఎండీ తాజ్, పార్థసారథి, చింతా ప్రభాకరరావు, మహ్మద్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డుకు మహర్దశ

- నెరవేరనున్న చిరకాల కల
- రూ.9.75 కోట్లతో పనులు
- 60 అడుగుల రోడ్డుగా విస్తరణ
- 13 చోట్ల కల్వర్టుల నిర్మాణం
- ఒక చోట కాజ్ వే

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డుకు మహర్దశ పట్టింది. ప్రధానమైన రోడ్డు విస్తరణతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక సాకారం కానుంది. సుమారు 9.75 కోట్లతో ఈ రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇరుగ్గా ఉన్న రహదారిని 60 అడుగుల వెడల్పుతో రెండు వరసల రహదారిగా విస్తరిస్తున్నారు.

సరిహద్దులను అనుసంధానించేలా..

మండలంలో కీలకమైన ఈ రోడ్డు విస్తరణతో మండల వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దు జిల్లాతో పాటు పలు మండలాల రోడ్లను అనుసంధానం చేసేలా ఈ రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. సబ్బవరం జాతీయ రహదారి నుంచి కోటపాడు-పినగాడి రోడ్లతో పాటు విజయనగరం జిల్లాలోని కొత్తవలస రోడ్డుకు అనుసంధానం కానుంది. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఇదీ పరిస్థితి

ప్రతి పక్షనేత హోదాలో ఉన్నప్పుడు చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సబ్బవరం మండలంలో పాదయాత్ర చేపట్టారు. సబ్బవరంలో నిర్వహించిన బహిరంగ సభకు గుల్లేపల్లి నుంచి సబ్బవరం ఈ రోడ్డు మీదుగా వెళ్లారు. ఇరుగ్గా ఉన్న ప్రధాన రోడ్డును అధికారం చేపట్టిన తర్వాత విస్తరిస్తామని అప్పట్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దాన్ని అమలు చేసేందుకు నిధులు మంజూరు చేశారు. రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్‌తో కలిసి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇటీవల శంకుస్థాపన చేశారు.



గుల్లేపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు



కొత్తరోడ్డు సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు





ఆదిరెడ్డిపాలెం సమీపంలో సాగుతున్న కాజ్‌వే నిర్మాణం

రెండు వరసలు.. 60 అడుగులు

ఈ రోడ్డు అభివృద్ధి పనులకు సుమారు రూ.9.75 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రోడ్డును రూ.5.71 కోట్లతో 60 అడుగుల వెడల్పున రెండు వరసల రహదారిగా విస్తరించనున్నారు. దీంతో పాటు ఆదిరెడ్డిపాలెం సమీపంలో కాజ్ వేతో పాటు రోడ్డు పొడువునా 13 చోట్ల శ్లాబ్‌తో పాటు పైప్ కల్వర్టులు నిర్మించనున్నారు.

ప్రస్తుతం కల్వర్టుల నిర్మాణంతో పాటు రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో రూ.4 కోట్లతో నిర్మించనున్న మేజర్ బ్రిడ్జి టెండర్ ప్రక్రియలో ఉంది.

ఎట్టకేలకు మోక్షం



అధ్వానంగా ఉన్న సబ్బవరం- గుల్లేపల్లి రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. ఇరుగ్గా ఉన్న ఈ రోడ్డుతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ రోడ్డు విస్తరణతో గుల్లేపల్లి,ఆదిరెడ్డిపాలెం, అంతకాపల్లి,రావలమ్మపాలెం,మల్లునాయుడు పాలెం,మొగలిపురం వంటి పలు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– యడ్ల నాయుడు, మొగలిపురం.

సాఫీగా ప్రయాణం చేయవచ్చు



ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు శిథిలావస్థలో ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవించేవి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రస్తుతం కల్వర్టుల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. పనులు పూర్తయితే సాఫీగా ప్రయాణం చేయవచ్చును.

– ఉప్పిలి దుర్గారావు, గుల్లేపల్లి

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అదిష్టింపజేసి అష్టోత్త శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

దేవాలయాల అభివృద్ధికి సహకారం



రమేష్ కృష్ణను సత్కరిస్తున్న సర్పంచ్ వెంకటరమణ

పెందుర్తి: దేవాలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధం ప్రాజెక్ట్ పర్యవేక్షణాధికారి డాక్టర్ రమేష్ కృష్ణ అన్నారు. మండలంలోని ఎస్ఆర్‌పురం శ్రీసీతారామచంద్ర ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ఆలయ అభివృద్ధికి టీటీడీ తరఫున సహకారం అందిస్తామని చెప్పారు. గొడవర్తి వెంకట సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన తిరుప్పావై ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. రమేష్ కృష్ణను సర్పంచ్ దూది వెంకటరమణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమత్ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 6.30నుంచి 7గంటల వరకు స్వామికి పంచామృతాభిషేకం, 7 నుంచి విశేష అలంకరణ, 7.30 గంటల నుంచి లక్ష తమలపాకుల పూజ, సింధూర పూజ చేశారు. 9 గంటల నుంచి పట్టాభిషేక పారాయణ, 9.30 గంటల నుంచి విశేష హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు విశేషంగా స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఏఈవో పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని హనుమాన్ విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు.



ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

- 98వవార్డు సింహపురికాలనీ, అప్పన్నపాలెం, సింహగిరి ఘాట్‌రోడ్డులోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వరుడిగా దర్శనమిచ్చిన అప్పన్న



వేంకటేశ్వరస్వామి అలంకరణలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న సిబ్బంది, అర్చకులు

సింహాచలం: రాపత్తు ఉత్సవాల్లో భాగంగా సింహగిరిపై రెండో రోజు ఆదివారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వేంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని వెంకన్నగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకీలో అదిష్టింపజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకిలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి విశేషంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకటాద్రిపై ఘనంగా ధనుర్మాసోత్సవాలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గాజువాక: పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకుని సందడి చేశారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరు వేసుకొంటూ సంతోషాన్ని పంచుకున్నారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1993–94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగ క్షేమాలను తెలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి విద్యార్థి నాయకులు గొలగాని అప్పలరాజు, శివశంకర్, వారిస్, బత్తుల హరి, గణేష్, కోటి, మురళి, వెంకటరావు, శివారెడ్డి, రామ్, శంకర్, ధనలక్ష్మి, సాగి కృష్ణవేణి, వై.లక్ష్మి, జీవీఎన్ అప్పారావు తదితరులు ఈ సమ్మేళనానికి సారథ్యం వహించారు.

27న అరకులోయలో అప్పన్న శాంతి కల్యాణం

- దేవస్థానం ప్రచార రథంతో తిరువీధి
- సింహాద్రిమఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి

సింహాచలం: ఈనెల 27న అరకులోయలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్టు సింహాచలంలోని సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి ఆదివారం తెలిపారు. రెండువేల మంది గిరిజన దీక్షాధారులు, భక్తులతో ఈ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. సింహాచలం దేవస్థానం సౌజన్యంతో సింహాద్రి మఠం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో భాగంగా దేవస్థానానికి చెందిన ప్రచార రథం అరుకులోయ వెళ్తుందని తెలిపారు. లోతేరు వెళ్లే మార్గంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శాంతికల్యాణం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తెలిపారు. అంతకముందు ఉదయం 9 గంటల నుంచి గిరిజన దీక్షాధారులు, భక్తులతో పద్మాపురం జంక్షన్ నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు ప్రచార రథంతో తిరువీధి నిర్వహించనున్నట్టు చెప్పారు.



వివరాలు తెలియజేస్తున్న సింహాద్రిమఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి

సింహాద్రిమఠం తరఫున దీక్షాదారులకు కంకణాలు(రక్షలు) అందిస్తామని తెలిపారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. భక్తులు, గిరిజనులంతా పూజల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

అంతర రాష్ట్ర క్రికెట్ పోటీలకు సంస్కృతి పాఠశాల విద్యార్థులు

పరవాడ: హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి 29 వరకు తెలంగాణ స్కూల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర అండర్–17 అంతర్ రాష్ట్ర టి–20 క్రికెట్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. పాఠశాల నుంచి జోగిందర్‌నాయుడు, ఆర్యన్‌సోని, మోహిత్, జ్యోతిస్వర్, ఫైజాన్, శాశ్వత్‌కుమార్, జె.తేజస్, సాహస్‌బాలు, సిద్ధార్థ, మూలీజీ, శరణ్‌ప్రీత్, తేజస్ పటేల్తో పాటు కోచ్‌గా బషీర్ ఎంపికయ్యారు. క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆదివారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి అభినందించారు.



అంతరరాష్ట్ర టీ–20 క్రికెట్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికైన జట్టు

ప్రైవేటీకరణకు కార్మికులు వ్యతిరేకం

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను కార్మికులంతా వ్యతిరేకిస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం జరుగుతున్న 1046వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణతో విశాఖ ఉక్కుకు భూములిచ్చిన నిర్వాసితులు రోడ్డున పడ్డారని ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కును అమ్మాలని చూడడం అన్యాయమని, దీనికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. సబ్బవరం మండల కేంద్రంలో వాహన చోదకులకు ఆదివారం సాయంత్రం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని.. వాహనాలను వేగంగా నడపరాదని డ్రైవర్లకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు.నిబంధనలు మీరిన వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ రంగనాథం, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న మార్గశిర పూజలు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 11వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. టౌన్‌కొత్తరోడ్డు వరకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.